క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామ శివారులో సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న సారా క్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఎ.డి, తదితరులు

సీతంపేట: రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి అన్నారు. మండలంలోని చాకలిగూడలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీదేవి, హెచ్ఓ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నాగాభరణం వితరణ



పూజలు చేస్తున్న దాతలు, అర్చకులు

పాలకొండ : పట్టణంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన వేమకోటి శ్రీనివాస్‌శర్మ, వేమకోటి మణికుమార్ శర్మలు మంగళవారం నాగాభరణం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు గానీదాస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నందెన్న సంబరాలు



పూజలందుకుంటున్న శివపార్వతులు, నందెన్న



ఆకట్టుకున్న కోలాటం

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలో నందెన్న సంబరాలు మంగళవారం వేడుకగా నిర్వహించారు. గౌరీ, పార్వతీ పరమేశ్వర విగ్రహాలను, నందెన్నను గౌరీపౌర్ణమి రోజున ప్రతిష్ఠించి గత 21 రోజులుగా దూప దీప నైవేద్యాలతో భక్తులు పూజలు చేశారు. నందెన్నను దర్శించుకునేందుకు రావుపల్లి, కొత్తపల్లి, బీవీపురం, గరుగుబిల్లి, గొట్టివలస, అజ్జాడ, సుమిత్రాపురం, గొల్లవానివలస తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంబరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులకు బ్యాంకు ఖాతాల వివరాలను ఎట్టిపరిస్థితులో ఇవ్వొద్దని సూచించారు. మీఖాతాను అప్‌డేట్ చేయాలంటూ వచ్చిన ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి ఉన్న సంపదను పోగొట్టుకోవద్దన్నారు. సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు ఫోను చేసి సమాచారం అందించాలన్నారు.

పొంచి ఉన్న ఆరోగ్య ముప్పు

- స్క్రబ్ టైఫస్ జ్వర లక్షణాలు గుర్తించిన వైద్యులు
- శరీరంపై ఎర్రని పొక్కులు, తీవ్ర జ్వరంతో రోగులు విలవిల
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు



ఎం.సింగుపురంలో జ్వర పీడితులు, రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు (ఫైల్)

పాలకొండ రూరల్: ప్రస్తుత శీతాకాల సీజన్‌లో ప్రజలు జలుబు, జ్వరం వంటి రోగాల బారినపడడం పరిపాటి. గాలిలో తేమశాతం వల్ల నిద్రావస్థలో ఉన్న వైరస్‌లు జీవం పోసుకుని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈక్రమంలో డెంగీ, చికున్‌గున్యాతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉంది. తాజాగా కొత్తరకం బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ జ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నల్లిని పోలిన ఓ రకం కీటకం ద్వారా ఈ జ్వరాలు వ్యాపిస్తాయి. ఈ కీటకం కాటు వస్తే శరీరంలోకి ఓరియోంటా సుషుగముషి అనే వైరస్ ప్రవేశించి వ్యాధి నిరోధక శక్తి నశిస్తుంది. చర్మంపై ఎర్రని పొక్కులు ఏర్పడతాయి. తెల్లరక్త కణాలు తగ్గిపోయి తీవ్ర జ్వరం వస్తుంది. ఈ వ్యాధి ముదిరిస్తే ప్రాణాపాయ స్థితి తప్పదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

పచ్చికబయళ్లే ఆవాసాలు...

ముఖ్యంగా పచ్చికబయిళ్లు, మురుగు నీరు నిల్వ ఉన్నచోట పెరిగే ఓ రకం (నల్లిని పోలి ఉండే) కీటకంలో ఓరియోంటా సుషుగముషి అనే బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఈ కీటకం కాటు వేసిన చోట నల్లని మచ్చతో పాటు చుట్టూ ఎరుపు రంగుతో కూడిన గాయం ఏర్పడి దురద పెడుతుంది. ఆపై తీవ్ర చలి, జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు, తలనొప్పితో పాటు శరీరంపై ఎర్రని దద్దుర్లు ఏర్పడతాయి. ఈ బ్యాక్టీరియా మనిషి శరీరంలో కలసినప్పుడు స్క్రబ్ టైఫస్ జ్వరం సంక్రమిస్తుంది. ఈ జ్వరం తీవ్రమైతే ఆ ప్రభావం ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలక భాగాలపై పడుతుంది. తెల్లరక్త కణాల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. జ్వరంతో పాటు శరీంలో వచ్చే మార్పులను గుర్తించిన వెంటనే అప్రమత్తమవ్వాలి. దీనిని గుర్తించేందుకు మ్యాల్‌కిల్లర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఈ పరికారాలు ప్రస్తుతం అన్నిచోట్ల అందుబాట్లో లేవు. డెంగీ మాదిరి లక్షణాలతో ఉండే జ్వరంతో పాటు రక్తంలో సోడియం నిల్వలు తగ్గడం దీని ప్రధాన లక్షణం.



శరీరంపై ఏర్పడే ఎర్రటి మచ్చలు

అంటు రోగం కాదు..



స్క్రబ్ టైఫస్ జ్వర లక్షణాలను ఇటీవల గుర్తించాం. ఈ లక్షణాలతో వస్తున్న వారిని, ఆయా ప్రాంతాలకు చెందిన వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఇది అంటు రోగం కాదు. తొలి దశలో గుర్తించడమే సరైన మార్గం. కేవలం సాధారణ యాంటీబయోటిక్స్ వినియోగం ద్వారా దీనిని అధిగమించవచ్చు. ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. చర్మంపై మచ్చలేర్పడి, త్రీవమైన జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ర్యాపిడ్ కిట్స్ ద్వారా పరీక్షలు చేయాల్సి ఉంటుంది.

– డాక్టర్ జే.రవీంద్రకుమార్, వైద్య నిపుణుడు, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

దీన్ని నియంత్రిచేందుకు ప్రత్యేక టీకా అంటూ ఏమీ లేదు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఈ జ్వరాలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఆశా వర్కర్లు కీలకం..

- డీఎంహెచ్ఓ పార్వతి

భామిని: గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య సేవలు అందించడంతో పాటు సుఖ ప్రసవాలు జరిపించడంలో ఆశ కార్యకర్తలు కీలకమని డీఎంహెచ్ఓ కె. విజయపార్వతి అన్నారు. భామిని, బత్తిలి పీహెచ్‌సీలలో డాక్టర్లు దామోదరరావు, సంతోషిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సుఖ ప్రసవాలు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలి కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. చిన్నారులు, బాలింతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డీఈఎంఓ యోగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బత్తిలి పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ విజయ పార్వతి

విత్తన సేకరణలో జాగ్రత్తలు తప్పనిసరి



వరిచేను కోస్తున్న రైతులు

గరుగుబిల్లి: మార్కెట్‌లో లభ్యమవుతున్న విత్తనాలలో నకిలీ, తాలుగింజలు కలుస్తుండటంతో పాటు విరివిగా లభించకపోవడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేరొక రైతువద్ద కొనుగోలుచేసిన విత్తనాలపై రైతులకు పూర్తిస్థాయిలో నమ్మకం లేకపోవడంతో రైతులే నేరుగా విత్తనాలను తయారు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వరికోతలు నిర్వహిస్తున్న తరుణంలో విత్తనాల సేకరణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి పలు విషయాలను వివరించారు. వరి విత్తనాల కోసం ఉదయం 9 గంటల తర్వాతే కోతలను ప్రారంభించాలన్నారు. సాధ్యమైనంతవరకు విత్తనాల కోసం కోసిన పంటను ట్రాక్టర్లతో తొక్కించకుండా బల్లపై కొట్టడం ద్వారా సేకరించడం మంచిదన్నారు. తాలు గింజలు, కేళీలు లేకుండా విత్తనాలను శుభ్రం చేసుకోవాలన్నారు. విత్తనాలను సేకరించేముందు ధాన్యంను 16 శాతం తేమ ఉండేలా ఆరపెట్టుకొని నిల్వ చేసుకోవాలన్నారు. వరివిత్తనాలను నిల్వచేసేముందు సంచులను పోలిడిన్ మందుతో శుభ్రం చేసుకోవాలన్నారు.

విత్తనాలను నింపిన సంచులను నేలమీద కాకుండా తడి తగలని ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవడంవల్ల మంచి నాణ్యమైన విత్తనాలు తయారుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

కేవీకేలో వ్యవసాయ విజ్ఞానం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ పంటల సాగులో రైతులకు కావాల్సిన వ్యవసాయ విజ్ఞానం లభిస్తుందని కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని రాజీవ్ గాంధీ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కేవీకే ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అలాగే కేవీకేలో ఉన్న వివిధ డెమో యూనిట్లు, వర్మీకంపోస్టు యూనిట్లు, పుట్టగొడుగుల యూనిట్, పౌల్ట్రీ షెడ్, చిరుధాన్యాల యూనిట్లను చూపించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంతవిహారి, డాక్టర్ అను, వై.ఉమాజ్యోతి, కళాశాల సిబ్బంది ఉన్నారు.



కేవీకే సేవలను విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో దీపార్చన



పట్టణంలోని ఉమారుద్ర కోటేశ్వర అయ్యప్ప సన్నిధానంలో స్వాములు మంగళవారం దీపార్చన నిర్వహించారు. అంతకుముందు అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–పాలకొండ

అవకాశాలు అందిపుచ్చుకోవాలి..

నిరుద్యోగ యువతీ, యువకులు వారికి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి సూచించారు. కళాశాల ప్రాంగణంలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం, అంజనాస్ ఫౌండేషన్ సంయుక్తంగా మంగళవారం చేపట్టిన ప్రత్యేక జాబ్‌డ్రైవ్‌లో ఆమె మాట్లాడుతూ, మేళాకు 68 మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోగా.. 51 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని అధ్యాపకులు, ఆయా సంస్థల ప్రతినిధులు అభినందించారు.

– పాలకొండ రూరల్



నేడు అన్న సమారాధన

పాలకొండ రూరల్: పట్టణంలోని అన్నపూర్ణ సహిత సనారి విశ్వనాథ అవధూత స్వామి ఆలయంలో బుధవారం అన్నదానం చేపట్టనున్నట్లు అర్చకుడు ప్రసాద్ పాడి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారం ప్రసాదం స్వీకరించాలని కోరారు.

సంతాపం..



రెడ్డి సన్యాసిరావు

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రానికి చెందిన ప్రముఖ కూరగాయల వ్యాపారి, సమాజ సేవకుడు రెడ్డి సన్యాసిరావు (68) మంగళవారం మృతి చెందడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కూరగాయల వర్తక సంఘం ద్వారా సన్యాసిరావు పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల వర్తకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు విచారం వ్యక్తం చేశారు.

బోర్లు, ఇంకుడు గుంతలపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఉపాధి ఈసీ రమణమూర్తి

భామిని: భూగర్భ జలాలు పెంపొందించడానికి బోర్లు, ఇంకుడుగుంతలు తవ్వించాలని ఉపాధి హామీ పథకం ఈసీ రమణమూర్తి సూచించారు. మండలంలోని గురండి, లోహరిజోల, నేరడి-బి, బిల్లుమడ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా బోర్లు, ఇంకుడుగుంతలు, గోశాలల నిర్మాణంపై అవగాహన కల్పించారు.

ఉచిత శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో నిరుద్యోగ యువతకు ఫేబ్రి కటర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కౌసల్య యోజన ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 7981308986లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి వేడుకను ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి గ్రామ పొలిమేరల్లో ఉన్న పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతకు పాలు, గుడ్లు, పండ్లు, చలిమిడి సమర్పించి పూజలు చేశారు. పుట్ట వద్ద బాణసంచా కాల్చి పిల్లలు సంబరాలు చేసుకున్నారు. నిత్యం పొలాల్లో తిరుగాడే రైతులు తమకు పాములు, ఇతర విషజంతువులు, క్రిమికీటకాల నుంచి ఎలాంటి హాని జరగకుండా ఉండేందుకు ఏటా నాగులచవితి రోజున పుట్టలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: నాగదేవతలకు పూజలు చేస్తున్న మహిళలు



గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో..



జియ్యమ్మవలస: పెదమేరంగిలో..



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో మొక్కులు చెల్లించుకుంటున్న దంపతులు



గరుగుబిల్లి: పెద్దూరులో..



వీరఘట్టం: పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



భామిని: నేరడిలో ఎల్లమ్మ సన్నిధిలో చవితి పూజలు

మహిళలను గౌరవించాలి

కొమరాడ: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నీలకంఠం హెచ్చరించారు. కూనేరు గ్రామంలో పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలి

గరుగుబిల్లి: ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలుచేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ఎన్నికలు ముగిసేంతవరకు కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు రాజకీయనాయకుల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. పంచాయతీలలో పేరుకుపోయిన ఇంటిపన్నుల బకాయిలు, ఇతర పన్నులను వసూలు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే శిక్షణ

వివిధ వృత్తులలో నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ పైడితల్లి అన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు స్కిల్ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృత్తులలో నైపుణ్యాన్ని గుర్తించేందుకు నిర్వహించే ఈ సర్వేను పారదర్శకంగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎల్.గోపాలరావు, ఏఈ అర్జునరావు తదితరులున్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ పైడితల్లి

వైభవంగా బోడిమెట్ట యాత్ర



బోడిమెట్ట ఎక్కుతున్న భక్తులు

అచ్చెపువలస బోడిమెట్ట యాత్రకు భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా నాగులచవితి పర్వదినం రోజున బోడిమెట్టను స్థానికులు అధిరోహించి, కొండపైనున్న గోవిందమ్మ పేరంటాలును దర్శించుకుంటారు. మంగళవార జరిగిన యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– వీరఘట్టం